క్లుప్తంగా

పీవీకి ఘన నివాళి



కేసముద్రం: మండల కేంద్రంలోని రైతువేదిక భవనం ఎదుట మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు జయంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, గుగులోతు దస్రూనాయక్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, కదిర సురేందర్, రావుల మురళీ పాల్గొన్నారు.

పోరాట యోధుడు డీవీ కృష్ణ



గూడూరు/నెల్లికుదురు/కేసముద్రం: కార్మిక శ్రామిక వర్గ పోరాట యోధుడు దుర్గంపూడి వెంకట కృష్ణ అని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, సీపీఐ (ఎంఎల్) మాస్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, జిల్లా నాయకుడు ఉమ్మగాని సత్యం అన్నారు. శనివారం డీవీ కృష్ణ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఈరెల్లి కొమురయ్య, పెదకాసు కొమురుమల్లు, బొమ్మెజు బ్రహ్మచారి పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చిత్రకారుడు, కళాకారుడు బసనబోయిన కృష్ణమూర్తికి గౌరవ డాక్టరేట్ వచ్చింది. అమెరికాలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నిర్వాహకులు చెన్నైలోని మైలాపూర్ భారతీయ విద్యాభవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ అందజేసి సత్కరించారు. కృష్ణమూర్తి రచించిన సమకాలీన సమస్యలు, ఒక కళాకారుడిగా పాత్ర ఆధారంగా, అలాగే ఆయన చిత్రకళలో చేసిన విస్తృత కృషికి గుర్తింపుగా ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మహబూబాబాద్: కాలనీలలో నెల కొన్న సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతినగర్‌లో శనివారం ఎమ్మెల్సీ పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మండల వెంకన్న, లింగన్న, పాపయ్య, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



నెహ్రూసెంటర్: జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం గ్రామగ్రామాన నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జ్ కోళ్ల శివ, ఇసినపల్లి అశోక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. జిల్లా విస్తృతస్థాయి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎల్లయ్య, ప్రవీణ్, యాకయ్య, యాకుబ్‌పాషా, కిరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో గురునాథరావు

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 26, 27 తేదీలలో జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ మండలి న్యూఢిల్లీ వారు నిర్వహించిన జాతీయ సెమినార్‌లో జిల్లా కేంద్రానికి చెందిన భౌతిక, రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడు డాక్టర్ వి.గురునాథరావు పాల్గొన్నారు. జాతీయస్థాయిలో పాఠశాలలు ఉపాధ్యాయ శిక్షణ సంస్థల కోసం విద్యారంగంలో నవీన ఆచరణలో ప్రయోగాలను, ప్రోత్సహించడానికి జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి ఈ జాతీయ సదస్సు నిర్వహించారు.

సేవాలాల్ సేన అధికార ప్రతినిధిగా సురేశ్




కురవి: మండలంలోని రాజోలు శివారు బాలు తండాకు చెందిన మాలోత్ సురేశ్‌నాయక్‌ను సేవాలాల్ సేన రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

మూతపడిన 'ఎత్తిపోతల'

- మరమ్మతులను పట్టించుకోని అధికారులు
- బీళ్లుగా మారిన రైతుల భూములు



అంజనాపురంలో మూలనపడ్డ ఎత్తిపోతల పథకం పైపులు



మూలనపడ్డ రాంపురం ఎత్తిపోతల పథకం షెడ్డు

గార్ల: గార్ల మండల పరిధిలోని అంజనాపురం, రాంపురం, బుద్దారం గ్రామాల సమీపంలోని పాకాల ఏటిపై నిర్మించిన ఎత్తిపోతల పథకాలు మూలనపడి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి. గార్ల మండలం అంజనాపురం, పెద్దకిష్టాపురం, చిన్నకిష్టాపురం, గ్రామాలకు చెందిన గిరిజన రైతులకు సాగునీరు అందించేందుకు పాకాల ఏటిపై 1986 సంవత్సరంలో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. 40హెచ్‌పీ సామర్థ్యం కలిగిన 3విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేశారు. ఇందుకు నాడు భద్రాచలం ఐటీడీఏ రూ.12.80లక్షలు మంజూరు చేసింది. పథకం నిర్మాణం అనంతరం దీని నిర్వహణను ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించారు. పదేళ్లపాటు ఈ పథకం సజావుగా సాగింది. 400ఎకరాలకు సాగునీరు అందడంతో ఈ ప్రాంత గిరిజన రైతులకు లబ్ధి చేకూరింది. లిఫ్ట్ నిర్వహణను భారంగా భావించిన ఇరిగేషన్ శాఖ 1996లో ఆయకట్టు రైతు అభివృద్ధి కమిటీకి అప్పగించింది. అప్పటి నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. 1999లో విద్యుత్ బకాయిలు రూ.10లక్షలకు చేరాయి. బకాయిలను రైతులు చెల్లించలేకపోయారు. మరోపక్క విద్యుత్ మోటార్లు కాలిపోయాయి. దీంతో పథకం మూతపడింది. ఆయకట్టు కింది 400 ఎకరాలు సాగు భూములు బీడు భూములుగా మారాయి. పైపులైన్లు, షెడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. 3కిలోమీటర్ల మేర పొడవున తవ్విన పంటకాల్వలు సైతం పూడిపోయాయి. ఈ పథకానికి మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి

ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న సందర్భంగా సంబంధిత జిల్లా అధికారులు ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టాలి. రైతుల భూములకు సాగునీరు అందించాలి. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలకు వెంటనే మరమ్మతులు చేయించాలి.

\- కందునూరి శ్రీనివాసరావు, సీపీఎం నాయకుడు

దాతల సహకారం మరువలేనిది



దాతను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సదానందం

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని ప్రిన్సిపాల్ పొక్కుల సదానంద అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు దాత ఖమ్మంపాటి విజయ్ శనివారం రూ. 20వేల విలువ గల 8వైట్ బోర్డులను వితరణ చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యానందిస్తున్నామని, రాష్ట్రస్థాయిలో ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు విద్యార్థులు సాధిస్తున్నారన్నారు. అనంతరం విజయ్‌ను కళాశాల అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కుమార్, సాధిక్, అలీ, పర్వీన్‌బేగం, స్వాతి, శ్రీనివాస్, రవి కిరణ్, శ్రీను, స్వాతిరాణి, సరిత, నవీన్, సురేందర్, సృజన, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి స్వాతి

మహబూబాబాద్ అర్బన్: యువత, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉన్నప్పుడే సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిమురారి అన్నారు. జిల్లా కేంద్రంలోని వికాస్ డిగ్రీ కళాశాలలో శనివారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశ భవిష్యత్‌ను కుంగదీసే మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు యువత, అధ్యాపకులు కృషి చేయాలన్నారు. మత్తు పదార్థాలకు సంబంధించిన ఏదైన సమాచారం తెలిస్తే వెంటనే జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. సమాచారం అందించిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ మహేందర్ రెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ బిక్కి వెంకటేశ్వర్లు, న్యాయవాదులు మోహన్, సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల అడ్డగింత



పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి అంబేడ్కర్ సెంటర్ నుంచి చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను పలువురు గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇప్పటికే రోడ్డుకు ఇరువైపుల ఉన్న వృక్షాలను తొలగించారు. ఈ క్రమంలో అంబేడ్కర్ సెంటర్ వద్ద పలు దుకాణాల ముందున్న సీసీ నిర్మాణాలు, చెట్ల దుంగలను జేసీబీ సాయంతో తొలగిస్తూ పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న పలువురు స్థానికులు, బాధితులు పనులను నిలిపివేయాలంటూ వారించారు. తామంతా ఎమ్మెల్యే మురళీనాయక్‌ను కలిశామని, 60 ఫీట్ల వరకే రోడ్డును ఏర్పాటు చేయాలని కోరామని, ఇంతలోనే మీరు ఎలా యంత్రాలతో రోడ్డు విస్తరణ పనులు చేస్తారంటూ అక్కడున్న వారితో వాగ్వాదానికి దిగారు. చివరకు పనులను నిలిపివేయడంతో, ఆందోళనకారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బట్టు శ్రీను, వోలం శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గార్ల: మద్యానికి బానిసై పురుగుమందు తాగి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం దుబ్బతండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం సేరిపురం పంచాయతీ దుబ్బతండాకు చెందిన బి.ఫూల్‌సింగ్ (45) అతిగా మద్యం తాగి, మద్యం మత్తులో జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స జరిపిస్తుండగా మృతిచెందాడు. మృతుడి కుమారుడు గణేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కె.రియాజ్‌పాషా వెల్లడించారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: ఇటీవల సిరిసిల్లలో జరిగిన రాష్ట్రస్థాయి ఉర్సు పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ తెలిపారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో శనివారం ఎంపికైన విద్యార్థులను పాఠశాల బృందం అభినందించింది. పోటీలకు శ్రీచరణ్, రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు విష్ణు ఎంపికైయ్యారని, రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో నవీన్ బంగారు పతకం సాధించారన్నారు. కార్యక్రమంలో పీడీ సింధువర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మహబూబాబాద్: పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు పాటుపడాలని అందుకోసం సైనికులా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తప్పు చేశామని ప్రజలు బాధ పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. రాబోయే అన్ని ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ప్రజలు అధిక మెజార్టీతో గెలిపిస్తారన్నారు. ఈ సమావేశంలో నాయకులు నాయిని రంజిత్, సుదగాని మురళీ, వెంకన్న, ఉప్పలయ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న కుమార్

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ, విలీన గ్రామాల అభివృద్ధికి నిధుల కేటాయించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ డిమాండ్ చేశాడు. పార్టీ శాఖల మహాసభలు శనివారం జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిధులు లేకపోవడంతో మున్సిపాలిటీ అభివృద్ధి కుంటుపడుతుందని పేర్కొన్నారు. 36 వార్డులకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, నాగెల్లి యాకమ్మ, బీమరాజు వెంకన్న, శ్రీకాంత్, జడల నటరాజ్, ఆలేటి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బావి స్థలం కబ్జాపై విచారణ



విచారణ చేస్తున్న ఎంపీఓ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కేవులతండా గ్రామంలో గ్రామ పంచాయతీకి సంబంధించిన నల్లాల బావి స్థలం కబ్జా చేయడంతోపాటుగా నీటిని అక్రమంగా వినియోగిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు మండల పంచాయతీ అధికారి పార్థసారథి శనివారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2004 సంవత్సరంలో స్థానిక ప్రజలకు తాగునీటి అవసరాల కోసం నాలుగు గుంటల స్థలాన్ని గ్రామ ప్రజలు కొనుగోలు చేసి గ్రామపంచాయతీకి అప్పగించారని తెలిపారు. నల్లాల బావి తనదే అంటూ గ్రామానికి చెందిన శంకర్ అందులోని నీటిని ప్రజలకు సరఫరా చేయకుండా అడ్డుకున్నాడని తెలిపారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధ్యాయుడికి ఘన వీడ్కోలు



కొత్తగూడ: కొత్తగూడ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు ఆయనను సన్మానించారు. నృత్యాలతో విద్యార్థులు అలరించారు. తన కోసం ఇంత మంది తరలిరావడం తన జీవితానికి సంతృప్తినిచ్చిందని రవీందర్ రెడ్డి కన్నీటితో కృతజ్ఞతలు తెలిపాడు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందడం లేదు

కేసముద్రం: కొందరు రాజకీయ నాయకుల జోక్యంతో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు అందడం లేదని ఎంసీపీఐ(యూ) పార్టీ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వివేక్‌కు పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు వీరస్వామి, రాజు, సతీష్, రవి, రాజు పాల్గొన్నారు.

పరామర్శ..

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన సట్ల అంజలి ఇటీవల హైదరాబాద్‌లో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం బాధిత కుటుంబాన్ని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పరామర్శించి, రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అంజలి చిన్నకూతురు మనస్వినీ చదువుకు ఆర్థికసాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేసముద్రం పీఏసీఎస్ చైర్మన్ దికొండ వెంకన్న, బేతమళ్ల చంద్రయ్య, దార్ల రామ్మూర్తి, వద్దిరాజు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ

గార్ల: ఉద్యోగంలో ఒక భాగం పదవీ విరమణ అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజకుమారి అన్నారు. 12 ఏళ్లుగా గార్ల జూనియర్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి శనివారం పదవీ విరమణ పొందిన జి.విమలను సన్మానించారు. కార్యక్రమంలో అప్పయ్య, అధ్యాపకులు చాంప్లా, రవీందర్, జోగ్యానాయక్, సోమన్న, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

డోర్నకల్: డోర్నకల్ మున్సిపల్ కమిషనర్‌గా నియమితులై ఇటీవల విధుల్లో చేరిన నిరంజన్‌ను శనివారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సుమేర్‌చంద్ జైన్, నాయకులు కేశబోయిన కోటిలింగం, మాదా శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శీలం శ్రీనివాస్, సొడం మహేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి

మరిపెడ: అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు బానాల రాజన్న, జిన్న లచ్చయ్య, బోడపట్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

పోలీసుల శ్రమదానం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ టౌన్ పోలీసుస్టేషన్ ఆవరణలో పోలీసు అధికారులు, సిబ్బంది శనివారం శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోనే కొనసాగుతా..

నర్సింహులపేట: కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని పార్టీ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రేఖ అనిల్‌కుమార్ యాదవ్ శనివారం తెలిపారు. ఇటీవల ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

లైసెన్స్ రద్దు చేస్తాం..

గార్ల: విత్తన దుకాణాల్లో డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తే, సదరు దుకాణం లైసెన్స్ రద్దు చేస్తామని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు హెచ్చరించారు. శనివారం గార్లలోని రైతువేదిక భవనంలో ఆయన మాట్లాడారు.

మంచినీటి సౌకర్యం కల్పించాలి

కురవి: మండల కేంద్రంలోని నరసింహస్వామి ఆలయం వద్ద ఉన్న హచ్చన్న కాలనీలో మంచినీటి సౌకర్యాలు కల్పించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ అనుబంధ పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు సామ పాపయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం ఎదుట బాధితులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమలో భద్రకాళీ, భూలచ్చమ్మ, యేసుమణి, వెంకన్న పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలను అందించాలి

మహబూబాబాద్ రూరల్: అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని సీపీఐ మండల కార్యదర్శి తండా సందీప్ అన్నారు. మండలంలోని సింగారం గ్రామంలో సీపీఐ గ్రామ శాఖ మహాసభ శనివారం నిర్వహించారు. జూలై 3న ముడుపుగల్ గ్రామంలో జరుగనున్న సీపీఐ మండల 16వ మహాసభలను జయప్రదం చేయాలన్నారు.

హాస్టల్ సౌకర్యం కల్పించాలి

గూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట శనివారం విద్యార్థులు తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ డీఎస్‌ఎఫ్‌ఐ మండల ఇన్‌చార్జ్ దేవేందర్‌కు వినతిపత్రం అందించారు.

గిరిజనుల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

గూడూరు: దర్తి ఆబా జనభాగిదారి అభియాన్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం మారుమూల ఆదివాసీగూడేల, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని ప్రత్యేక అధికారులు దారం శ్రీనివాస్, హంసావత్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పొనుగోడు, ఊట్ల గ్రామాలలో శనివారం పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

నోట్‌బుక్స్ పంపిణీ



మరిపెడ రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులను దాతలు ఆదరించి హక్కున చేర్చుకోవాలని ఆర్‌ఐ శరత్ చంద్ర గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని గాలివారిగూడెం గ్రామంలోని యూపీఎస్‌లో అంబేడ్కర్ పూలే మహాజన సంఘం జిల్లా అధ్యక్షుడు చింత వెంకన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు చింత దిలీప్, హెచ్‌ఎం వెంకన్న, ఉపాధ్యాయులు మురళీధర్, వీరన్న, రాజేంద్ర, సావిత్రి, ప్రేమ్‌కుమార్, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.


అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇంటి పత్రాలు, చెక్కులు పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్‌లు, మున్సిపల్ కమిషనర్

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందని కేసముద్రం, ధన్నసరి పీఏసీఎస్ వైస్ చైర్మన్‌లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో 100 మందికి ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను, 13 మందికి సీఎంఆర్ఎఫ్, 50 మందికి కల్యాణలక్ష్మీ చెక్కులను మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణితో కలిసి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, మురళీ, దస్రూనాయక్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి



మృతి చెందిన గేదెల వద్ద బాధితులు

డోర్నకల్: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శనివారం విద్యుదాఘాతంతో పాడి గేదె, దూడ మృతి చెందాయి. గార్ల మండలం బీఆర్‌ఎం తండాకు చెందిన షేక్ ఫర్జానాకు చెందిన పాడిగేదె, దూడ విద్యుత్‌స్టేషన్ సమీపంలో మేతకు వెళ్లి, తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందాయి. వాటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని షేక్ ఫరాజనా తెలిపారు.

పాముకాటుతో కాడెద్దు..

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన రైతు లావణ్య భోజ్యకు చెందిన కాడెద్దు పాముకాటుతో శనివారం మృతిచెందింది.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

కురవి: మండలంలోని నేరడ శివారు బాల్య తండా గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమి(గుట్ట)ని తండాకు చెందిన కొందరు వ్యక్తులు శనివారం ఆక్రమించేందుకు పొక్లెయిన్‌తో చదును చేసే యత్నం చేశారు. బాల్య తండా జీపీ పరిధిలో 545/1లో 30 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. అయితే ఆ తండాకు చెందిన కొందరు వ్యక్తులు గుట్టను తొలగించి వ్యవసాయ భూమిగా మార్చుకునేందుకు భూమిని చదును చేస్తున్నారు. ఈ విషయమై తండాకు చెందిన పెద్దలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్‌ఐ రవికుమార్ ఆరుగురు వ్యక్తులను కార్యాలయానికి పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముమ్మరంగా మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



యాదవనగర్‌లో పైపులైన్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పలుచోట్ల పగిలిన పైపులైన్లకు శనివారం మరమ్మతు పనులు చేపట్టారు. అమృత్ పథకం అమలు కోసం జరిపిన తవ్వకాలతో పలుచోట్ల పైపులు పగలడం, రోడ్లు బురదమయం కావడంపై 'సాక్షి' దినపత్రికలో వెలువడిన కథనంపై స్పందించిన మున్సిపాలిటీ అమృత్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. తవ్వకాలతో రోడ్ల ప్రక్కన పేరుకుపోయిన మట్టి కుప్పలను తొలగించారు.